భక్తిశ్రద్ధలతో.. గుడ్‌ఫ్రైడే

బోరబండలోని సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చిలో ఏసుక్రీస్తు జీవిత ఘట్టాలపై ప్రదర్శనలో ఒక సన్నివేశం

బంజారాహిల్స్ రోడ్ నం:8లోని సెయింట్ ఆల్ఫోన్సాస్ చర్చి ఆవరణలో ఏసుక్రీస్తును శిలువ వేసే దృశ్యం

- పలు చర్చిల్లో ఘనంగా ఏసుక్రీస్తు జీవిత ఘట్టాల ఆవిష్కరణ
- భక్తిశ్రద్ధలతో నాటిక రూపేణ జీసస్ చరిత్ర ప్రదర్శన

హిమాయత్‌నగర్/బంజారాహిల్స్/ఎర్రగడ్డ/ఖైరతాబాద్, మార్చి 29: మానవాళి పాపాలకు పరిహారంగా యేసుక్రీస్తును శిలువ వేసిన రోజే గుడ్‌ఫ్రైడే అని బాప్టిస్ట్ చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ జి.శామ్యూల్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నారాయణగూడలోని బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. శామ్యూల్ ప్రసంగిస్తూ.. దేవుని యందు నమ్మకంతో ముందుకు సాగితే నిత్య జీవితం లో ప్రతిఒక్కరికీ విజయ ప్రాప్తి కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా వందలాది మంది క్రైస్తవులు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, సోమాజిగూ డ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని చర్చిల్లో ఏసుక్రీస్తు త్యాగాలను గుర్తుచేసుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నం:12లోని షరోన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ ఎం.ప్రభుదాస్ ప్రత్యేక సందేశాన్ని అందజేశారు. తన రక్తంతో సమస్త మానవాళి పాపాలను శుద్ధి చేయడం కోసం ఏసుక్రీస్తు శిలువను ఎక్కారని పేర్కొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.8లోని సెయింట్ అల్ఫోన్సాస్ చర్చిలో క్రీస్తు శిలువను వేసే సన్నివేశాలతో నిర్వహించిన ప్రత్యేక రూపకం భక్తులకు కన్నీళ్లు తెప్పించింది. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని చర్చిల్లో కార్యక్రమాలు జరిగాయి. బోరబండ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ ఆవరణలోని మైదానంలో క్రైస్తవ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. ముఖ్యంగా శిలువ మోసే సన్నివేశాన్ని వందలాది మంది తిలకించారు. కార్యక్రమాల్లో విక్టర్, ఎన్.విజయకుమార్, రాబిన్, జాకబ్, ఎడ్వర్డ్ జేమ్స్, లారెన్స్, అలెక్స్, విజయ్, జాన్ డిసౌజా, ఆంథోనీ, ఆల్ఫోన్స్, బెంజ్‌మెన్, ఫాదర్ శాంతమూర్తి, ఫాదర్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

పలు చర్చిల్లో ప్రార్థనలు

ఖైరతాబాద్‌లోని లెమెన్స్ ఎవాంజికల్ ఫెలోషిప్, మారుతీనగర్‌లోని డమాస్కస్ చర్చిల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాస్టర్ బ్రదర్ అబ్రహం, రెవరెండ్ డాక్టర్ పాల్ కరుణాకర్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 29: గగన్ పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. గంగోత్రి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు గంగోత్రి పారిశ్రామిక ప్రాంతం, అమ్మ గార్డెన్, టీఎన్‌జీవోస్ కాలనీ, గణేశ్ నగర్, స్వప్న థియేటర్ తదితర ప్రాంతాలల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామని విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

గంటల తరబడి ట్రాఫిక్ జాం - జనప్రియ చౌరస్తాలో ట్రాఫిక్‌ను నియంత్రించాలి

అత్తాపూర్, మార్చి 29: ట్రాఫిక్ కారణంగా హైదర్‌గూడ జనప్రియ చౌరస్తాలలో తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. ఉయదం సాయంత్రం వేళల్లో గంటల తరబడి ట్రాఫిక్ జాం ఏర్పడుతుండటంతో ప్రయాణికులు సమయానికి గమ్యస్థానానికి చేరుకోలేక పోతున్నారు. రహదారి చిన్నదిగా ఉంటడం, రహదారులపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఉదయం పాఠశాలలకు, ఆఫీసులకు వెళ్లే సమయంలో ఇబ్బందిగా ఉంటుందని వాహనదారులు చెబుతున్నారు. పెద్ద పెద్ద వాహనాలు కూడా ఉదయం సమయంలో వస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. ట్రాఫిక్ జాం కారణంగా ఎవరు పట్టించుకోకపోవడంతో ఒక్కోసారి సామాన్య ప్రజలే నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. హైదర్‌గూడ, ఎర్రబోడ, సిరిమల్లె కాలనీ, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, చైతన్యవిలాస్ కాలనీ లాంటి ప్రాంతాలకు వెళ్లే వారు జనప్రియ చౌరస్తా నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఫలితంగా తరచు ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు గంటల పాటు ట్రాఫిక్ పోలీసులను నియమిస్తే ట్రాఫిక్ సమస్యను నియంత్రించవచ్చని కాలనీల వాసులు చెబుతున్నారు. దీంతో పాటు రహదారులపైనే చేస్తున్న వాహనాల పార్కింగ్ అడ్డుకోవాలని స్థానిక కాలనీల ప్రజలు కోరుతున్నారు.

పొరుగు జిల్లాల ఆటోలను అనుమతించొద్దు

తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్

సమావేశంలో మాట్లాడుతున్న అమానుల్లాఖాన్

హిమాయత్‌నగర్, మార్చి 29: నగరంలోకి పొరుగు జిల్లాల ఆటోలను అనుమతించకుండా నగర పోలీస్ కమిషనర్, ఆర్‌టీఏ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ విజ్ఞప్తి చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు గిరాకీలేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో పొరుగు జిల్లాలలో రిజిస్టరైన వేలాది ఆటోలు నగరంలోకి రావడంతో ఇక్కడి ఆటో డ్రైవర్లకు మరింతగా గిరాకీలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఓలా, ఊబేర్, ర్యాపిడో క్యాబ్‌ల యాజమాన్యాలు చేసే దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆటో జేఏసీ నాయకులు కె.లక్ష్మినర్సయ్య, ఎస్‌కే జమా, మహ్మద్ అజీమోద్దిన్, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

యువతలో క్రీడాసక్తి పెంపొందేలా..

సైకిల్ యాత్రకు బయల్దేరుతున్న మీర్ తమీమ్‌ను అభినందిస్తున్న సైక్లిస్టులు

ఖైరతాబాద్, మార్చి 29: క్రీడల ప్రాముఖ్యతను, వాటిపై యువతలో ఆసక్తిని పెంపొందించేందుకు సైక్లిస్ట్ తమీమ్ అన్సారీ కాశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాడు. సచివాలయం వద్ద హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఆధ్వర్యంలో తమీమ్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని స్ఫూర్తి నింపాలని ఆకాంక్షించారు.

జాగృతమై.. పార్టీలు మారే వారిని ఓడించాలి: భూపాల్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌గౌడ్

ఖైరతాబాద్, మార్చి 29: దేశంలో అవినీతిని పారదోలడంలో పాలకులంతా విఫలమయ్యారని ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ భూపాల్‌గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పాలించిన అన్ని పార్టీలు కుంభకోణాలు, అవినీతికి పాల్పడ్డాయన్నారు. అందరూ ఓటర్లకు నోట్లు ఇచ్చి గెలిచిన వారేనని, అలాంటి వారి పాలనలో అన్ని ప్రభుత్వ రంగాలు భ్రష్టు పట్టిపోయాయన్నారు. సామాన్యుడు ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే లంచం లేనిది పనులు కాని పరిస్థితి కొనసాగడం విచారకరమన్నారు. అవినీతి పరులు ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి జంప్ అవుతున్నారని అన్నారు. ఓటర్లు జాగృతం కావాలని, పార్టీలు మారే వారిని తమ ఓటు హక్కుతో ఓడించాలని ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు భూపాల్ గౌడ్ పిలుపునిచ్చారు.

కేపీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 29: కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.గోవర్ధన్ రెడ్డి రెండోసారి భారీ మెజార్టీతో విజయం సాధించాడు. కూకట్‌పల్లి కోర్టులో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బరిలోకి దిగిన గోవర్ధన్‌రెడ్డి 340 ఓట్లను సాధించాడు. సమీప ప్రత్యర్థి టి.పరమేశ్వర్ 126 ఓట్లు సాధించగా.. 214 ఓట్ల భారీ మెజార్టీతో గోవర్ధన్‌రెడ్డి విజయం సాధించాడు. ఉపాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధానకార్యదర్శిగా .రమేశ్, సంయుక్త కార్యదర్శిగా బి.యాదయ్య, కోశాధికారిగా ఖలీల్‌పాషా, గ్రంథాలయం కార్యదర్శిగా శ్రీలత, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా అరుణకుమార్, మహిళా కార్యదర్శిగా సదాలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా చంద్రమౌళి, జ్యోత్స్నాదేవి, నాగలక్ష్మి, పల్లవి, ప్రవీణ్‌రెడ్డి, రమేశ్, విజయ్ విజయం సాధించారు.

కాంగ్రెస్‌కు అధికారమిస్తే.. తాగు, సాగుకు నీటి కరువు

సమావేశంలో మాట్లాడుతున్న బుక్క వేణుగోపాల్

శంషాబాద్ రూరల్, మార్చి 29: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తాగు, సాగునీరు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బుక్క వేణుగోపాల్ అన్నారు. శంషాబాద్ పట్టణంలోని బేగం ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ బూత్ ఇన్‌చార్జిలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన.. మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కేంద్రంలో మరోసారి మోదీని ప్రధాన మంత్రిని చేయాలని సూచించారు. భారతదేశం అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు అందడంతో పాటు దేశం రక్షణగా ఉండటం కోసం బీజేపీని గెలిపించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు వడ్డె చంద్రయ్య, ఎంపీటీసీ బుక్క ప్రవీణ్, ఎన్.కుమార్‌యాదవ్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకర విన్యాసాలు.. కమిషనర్లకు నెటిజన్ల ట్వీట్

రోడ్లపై అర్ధరాత్రి వాహనాలతో విన్యాసాలు చేస్తున్న యువకులు

బండ్లగూడ, మార్చి 29: అర్ధరాత్రి రోడ్లపై యువకులు బైక్‌లపై విన్యాసాలు చేస్తు వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్లర్ నం:140 నుంచి 170 వరకు యువకులు బైక్‌లపై ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ, ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సమయంలో భయాందోళనకు గురైన తోటి వాహనదారులు వారి విన్యాసాలను వీడియోలు తీసి ట్విట్టర్ ద్వారా సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లకు ట్యాగ్ చేశారు. ప్రమాదకర విన్యాసాలతో తోటి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు ఉన్నాతధికారులకు విజ్ఞప్తి చేశారు. అధికారులు దీనిపై సంబంధిత పోలీస్ ష్టేషన్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానికంగా వాహనదారు లకు ఇబ్బందులు కలిగించొద్దని వారు విజ్ఞప్తి చేశారు.

మండే ఎండలు.. బోసిగా రహదారులు

అత్తాపూర్, మార్చి 29: ఎండలు మండుతుండటంతో మధ్యాహ్నం రహదారులన్నీ బోసిపోయి నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. రెండు మూడు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో జనాలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ప్రతి రోజు వాహనదారులు, పాదచారులతో కిటకిటలాడుతూ ఉండే చౌరస్తాలు, రహదారులు మధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా అత్తాపూర్ డివిజన్ పరిధిలోని అత్తాపూర్, హైదర్‌గూడ, జనప్రియా చౌరస్తా, నంది ముస్లాయిగూడ, సిరిమల్లె కాలనీ, బాపూఘాట్ రహదారులు ఖాళీగా ఉంటున్నాయి. ఉదయం వేళలో పనులు చేసుకుంటున్నామని ఎండకు బయటకు రావాలంటేనే ఇబ్బందిగా ఉంటుందని పలువురు చెబుతున్నారు. మధ్యాహ్నం వేళ వ్యాపారం కూడా జరగడం లేదని చిరు వ్యాపారులు చెబుతున్నారు. మార్చిలోనే ఎండలు విపరీతంగా ఉంటే రానున్న రోజుల్లో ఎంతగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

సూర్జీత్‌కౌర్(ఫైల్)

దుండిగల్, మార్చి 29: ఉత్తర ప్రదేశ్ నుంచి అల్లుడి ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దల్జీత్ సింగ్, సూర్జీత్‌కౌర్ (38)దంపతులు మరో మహిళతో కలిసి ఈనెల 23న కుత్బుల్లాపూర్ సూరారం శ్రీరాంనగర్‌లో నివాసముంటున్న తమ అల్లుడు నవజ్యోత్‌సింగ్ ఇంటికి వచ్చారు. శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సూర్జీత్‌కౌర్ రాత్రి అయినా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేదు. దీంతో నవజ్యోత్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే సూర్జీత్‌కౌర్ స్వల్ప మతిస్థిమితంతో బాధపడుతుండటంతో అప్పుడప్పుడు ఇలా చేస్తుందని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మహిళ అదృశ్యం

అంజలి(ఫైల్)

నేరేడ్‌మెట్, మార్చి 29: మహిళ అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ సీబీఎన్ కాలనీలో నివా సం ఉంటున్న గృహిణి కేతాపత్ అంజలి(21) ఈనెల 19న ఇంటి నుంచి బయటికి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, బంధువులు వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దాంతో వారు శుక్రవారం ఉదయం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే అంజలి గతంలోనూ రెండుసార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చిందని కుటుంబసభ్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తిపన్ను చెల్లింపునకు రెండ్రోజులే గడువు

- సద్వినియోగం చేసుకోవాలి: డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్



రూ.34 లక్షల ఆస్తి పన్ను చెక్కును స్వీకరిస్తున్న ఏఎంసీలు కమల్, బాలరాజు

జూబ్లీహిల్స్, మార్చి 29: గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రాపర్టీ ట్యాక్స్‌పై నగర పాలక సంస్థ అందిస్తున్న వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్ రేపటితో ముగియనుంది. అంతేగాకుండా ఈ ఏడాది ఆస్తిపన్ను చెల్లింపులకు గడువు కూడా మార్చి 31తో ముగియనున్న విషయం తెలిసిందే. ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించి 2022-23 వరకు ఉన్న బకాయిలు ఒకేసారి చెల్లించేవారికి 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ జీహెచ్ఎంసీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌ను అందిస్తుంది. ఇందులో భాగంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్నుకు కేవలం 10 శాతం వడ్డీతో పాత బకాయిలు చెల్లించే సువర్ణావకాశాన్ని కల్పించారు. ఈ అవకాశాన్ని కొంతమంది వినియోగించుకోగా మరి కొంత మంది దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. అయితే, ఈ ఆఫర్ మరో రెండు రోజులు అందుబాటులో ఉండనుండటంతో జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్ అధికారులు దీనిపై విస్తృత ప్రచారం చేపడుతున్నారు. దీంతో పాటు ఆస్తిపన్ను చెల్లింపులకు మార్చి 31తో గడువు ముగియనుండటంతో నిర్ధేశిత రూ.33.73 కోట్ల లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు ముమ్మర యత్నాలు చేస్తున్నారు. పాత బకాయిలతో పాటు ఆస్తిపన్ను చెల్లింపులకు అందిస్తున్న వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌కు ఈ రెండు రోజులు మాత్రమే అవకాశం ఉండటంతో జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు పెద్ద ఎత్తున ఆస్తిపన్ను వసూలు చేపడుతున్నారు. కాగా, యూసుఫ్‌గూడ సర్కిల్‌లో గత ఆర్థిక (2022-23) సంవత్సరం రూ.27.17 కోట్లు వసూలు చేసిన అధికారులు ఈ ఏడాది ఇప్పటివరకు రూ.27.38 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేసి గతేడాది కలెక్షన్స్‌ను అధిగమించడం విశేషం. శుక్రవారం ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్‌లు రూ.34 లక్షల ఆస్తిపన్ను చెక్‌ను స్వీకరించారు.

నేడు చివరి ఆస్తిపన్ను పరిష్కార వేదిక..

19వ సర్కిల్ కార్యాలయంలో నేడు చివరి ఆస్తిపన్ను పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఈ నెలలో ప్రతి ఆదివారం ఆస్తిపన్ను వివాదాలు పరిష్కరిస్తున్నారు. నాలుగు వారాలుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో మార్చి 31న చివరి ఆస్తిపన్ను పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. వివాదాల పరిష్కారంతో పాటు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకొని బకాయితో పాటు పన్ను పూర్తిగా చెల్లించాలని డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ కోరారు.

పోలీసు వృత్తికే వన్నె తెచ్చిన ఉమేశ్‌చంద్ర

- నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

ఉమేశ్‌చంద్ర విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

వెంగళరావునగర్, మార్చి 29: పోలీస్ శాఖలో ఉత్తమ సేవలందించిన ఉమేశ్‌చంద్ర సేవలు చిరస్మరణీయమని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దివంగత ఐపీఎస్ చదలవాడ ఉమేశ్ చంద్ర జయంతిని శుక్రవారం ఎస్సార్‌నగర్ కూడలి వద్ద నిర్వహించారు. కూడలి వద్దనున్న ఉమేశ్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి కమిషనర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణతో పాటు విధి నిర్వహణలో అంకితభావం కనబరచిన ఉమేశ్ చంద్ర పోలీసు వృత్తికే వన్నె తెచ్చారన్నారు. ప్రజల రక్షణ కోసం అలుపెరుగని రీతిలో పనిచేసిన ఉమేశ్‌చంద్ర భావితరాలకు, పోలీసు యంత్రాంగానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉమేశ్ చంద్ర తల్లిదండ్రులు వేణుగోపాలరావు, నయనతారలను పరామర్శించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ హనుమంతరావు, ఏసీపీలు మోహన్‌కుమార్, పి.వెంకటరమణ, ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జానకిరాములు, సంఘ సేవకులు కొత్తపల్లి మధుసూదన్‌రావు, సర్దార్ టిల్లూభాయ్, ఎస్సార్‌నగర్ పీఎస్ సిబ్బంది ఉమేశ్ చంద్ర విగ్రహానికి నివాళులర్పించారు.

ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లో ఇఫ్తార్ విందు

ఎర్రగడ్డ, మార్చి 29: ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లోని మహ్మదీయ మసీద్ వద్ద శుక్రవారం ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథులుగా మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్ పటేల్, మాజీ కార్పొరేటర్ శ్యామ్ ముదిరాజ్‌లతో పాటు నాయకులు జానిమియా, అర్షద్ అలీ ఖాన్, అన్వర్ ఖాన్, రహీం, అజర్, అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వజ్రాభరణాల అపహరణ

బంజారాహిల్స్, మార్చి 29: పని చేస్తున్న ఇంట్లో వజ్రాభరణాలు తస్కరించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజానివాసం ఉంటున్న యష్ లల్వాని అనే వ్యాపారి ఇంట్లో మూడేళ్లుగా బీహార్‌కు చెందిన సాహెబ్ కుమార్(21) పనిమనిషి. ఇటీవల యష్ తల్లికి చెందిన మూడు వజ్రపు ఉంగరాల జతలు బీరువాలో పెట్టారు. పదిరోజుల తర్వాత చూడగా బీరువాలో పెట్టిన ఉంగరాలు కనిపించలేదు. అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సీసీ ఫుటేజీలను పరిశీలించడంతో పనిమనిషి సాహెబ్‌కుమార్ గదిలోకి వెళ్లినట్లు కనిపించింది. దీంతో అతడిపై అనుమానం వ్యక్తం చేస్తూ యష్ శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదుతో ఐపీసీ 381 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

ఖైరతాబాద్, మార్చి 29: రియల్ ఎస్టేట్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగింది. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సోమాజిగూడలోని మహేశ్వరి చాంబర్‌లో ఉన్న వెంకటేశ్వర రియల్ ఎస్టేట్ కార్యాలయంతో పాటు జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తున్నారు. సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలంటుకున్నాయి. వెంటనే షాపు మొత్తం వ్యాపించడంతో సామగ్రి దహనమయ్యింది. పోలీసులకు సమాచారం అందించగా, ఫైరింజన్లను రప్పించి మంటలను అర్పివేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, మార్చి29 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శుక్రవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో సుమధుర ఆర్ట్స్ అకాడమీ గురువులు శ్రావ్య మానస శిష్య బృందం కూచిపూడి, జానపద నృత్యాలతో అలరించారు. కళాకారులు అన్నమయ్య కీర్తనలు, మేడారం జాతర, చందనలో అంశాలను జానపద నృత్య రూపకంలో ప్రదర్శించారు.